
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 37.0 । కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY 5



జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు

శనివారం 15 మార్చి 2025



రంజాన్ వేళలు

ఇఫ్తార్(శనివారం)-6:31

సహెర్ (ఆదివారం)-5:02

'ఉద్యమ' ఊపిరి

యువరక్తమే నాటి గ్రంథాలయానికి పునాది

6



జోగులాంబ ఆలయంలో భక్తుల రద్దీ



ఆలయ ప్రాంగణంలో చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

అలంపూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లా అలంపూరు పుణ్యక్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. జోగులాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి వార్లను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తుంగ భద్రనది పుష్కరఘాట్‌లో స్నానమాచరించి, స్వామివారి ఆలయంలో గణపతి పూజ, అభిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన వంటి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు త్రిశతి ఖడ్గ మాలలు, చీరలు, గాజులు, వడిబియ్యం మొక్కులను సమర్పించి సాయంత్రం మహా మంగళ హారతిలో పాల్గొన్నారు.

ఆలయంలో చండీహోమాలు..

జోగులాంబ అమ్మవారి ఆలయంలో శుక్రవారం 117 మందితో చండీ హోమం, రుద్రహోమం నిర్వహించారు. ప్రతీ అమావాస్య, పౌర్ణమి, శుక్రవారం చండీహోమాలు నిర్వహిస్తారు. సామూహికంగా చండీహోమాల్లో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తుంటారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన హోమాలు మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతితో ముగుస్తాయని ఆలయ ఈవో పురేందర్ కుమార్ తెలిపారు.



అలంపూరు జోగులాంబ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఎండుతున్న పంటలు



మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని రుద్రారంలో ఎండిన వరి చేనును గొర్లకు వదిలేసిన రైతు

- కొద్ది రోజులైతే చేతికి వచ్చే దశలో ఎండిపోతున్న వరి
- కొన్నిచోట్ల మేతకు.. మరికొన్నిచోట్ల పంటకు నిప్పు
- ప్రధాన ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నిండుకున్న నీటి నిల్వలు
- భూగర్భ జలాలు కూడా తగ్గడంతో బావుల కిందా అదే పరిస్థితి
- సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసినా మారని దుస్థితి
- వరిసాగు పెరగడం.. అధిక నీటి వినియోగమే ప్రధాన కారణం

మహబూబ్‌నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వేసవి ప్రారంభమైంది. ఎండలు 40 డిగ్రీలను దాటి నమోదవుతున్నాయి. ఈ సమయంలోనే చేతికి వచ్చే పంటలు ఎండ తీవ్రత, నీటి ఎద్దడితో ఎండుముఖం పడుతున్నాయి. భూగర్భ జలాలు దిగువకు పడిపోతుండటం, ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నిల్వలు నిండుకుంటుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. చేతికి వచ్చిన పంటను పశువులకు మేతగా వేయడమో లేదంటే నిప్పు పెట్టడమో చేస్తున్నారు. వాస్తవానికి ఒకప్పటితో పోల్చితే ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. అత్యంత కరువు ప్రాంతంగా పేరున్న నారాయణపేట జిల్లాలోనూ వరిసాగు అధిక మొత్తంలోనే సాగవుతోంది. 2023 మినహా మిగతా సంవత్సరాల్లో వర్షాలు కూడా అధికంగానే కురిశాయి. ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షపాతమే ఉమ్మడి జిల్లా పరిధిలో నమోదైంది. అయితే ఇరిగేషన్ అధికారులు నీటి వినియోగం విషయంలో సరైన ప్రణాళిక రూపొందించకపోవడం, వచ్చిన నీటిని ఒడిసిపట్టుకుని ఎక్కువ కాలం నిల్వ చేసుకోలేకపోవడం, రైతులు కూడా నీటి అవసరం తక్కువ ఉన్న పంటలను కాకుండా వరిపై ఎక్కువ మక్కువ చూపడం కూడా ప్రస్తుత పరిస్థితికి



నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం చంద్రాయన్‌పల్లిలో ఎండిన వరి పంటను చూపుతున్న రైతు

కారణంగా చెప్పవచ్చు. ఉమ్మడి జిల్లాలో మెజారిటీ ఆయకట్టుకు నీరందించాలంటే జూరాల, శ్రీశైలం మాత్రమే ఆధారం. ఇప్పుడు ఆ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయి. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి 4 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు ఒప్పందం కుదిరింది. ఇప్పటివరకు నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి కేవలం 1 టీఎంసీ నీటిని విడుదల చేయగా, జూరాల ప్రాజెక్టు వద్ద కేవలం 0.4 టీఎంసీల నీరు వచ్చినట్లు రికార్డు అయ్యింది. నది పొడవునా గుంతలు ఉండటం, ఎండకు నీరు ఆవిరి కావడం, మధ్యలో మోటార్లతో తోడివేత వల్ల 0.6 టీఎంసీల నీరు ప్రాజెక్టుకు చేరలేదు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో 2.020 టీఎంసీ నీరు నిల్వ ఉంది. ఇందులో కేవలం 0.976 టీఎంసీలు మాత్రమే వాడుకోవచ్చు. మిగతానీరు డెడ్ స్టోరేజీలో ఉంటుంది. శ్రీశైలం ప్రాజెక్టులో పూరి స్థాయి సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 69.16 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది.

ప్రణాళిక లేకపోవడం వల్లనే..

ఉమ్మడి పాలమూరు

(మిగతా 6లో..)

బొటానికల్ గార్డెన్‌కు ఐదేళ్లు..


- తెలంగాణ రాష్ట్ర ఆకృతిలో జడ్చర్లలో ఏర్పాటు
- మొక్కలు నాటిన ప్రముఖులు
- పరిశోధనలకు నిలయంగా తీర్చిదిద్దుతున్న కోఆర్డినేటర్ డాక్టర్ సదాశివయ్య



బొటానికల్ గార్డెన్‌లో మొక్క నాటి నీరు పోస్తున్న వనజీవి రామయ్య దంపతులు (ఫైల్)

7

సంబురంగా.. హోలీ



వనపర్తి పట్టణంలోని మర్రికుంట ప్రాంతం వద్ద హోలీ సంబురాల్లో యువకులు

హోలీ వేడుకలు నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉత్సాహంగా జరుపుకొన్నారు. గురువారం అర్ధరాత్రి కాముడి దహనం చేశారు. శుక్రవారం ఉదయం నుంచి చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరూ వేడుకల్లో పాల్గొన్నారు. రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వివిధ సంఘాలు, అధికారుల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. యువకులు వీధుల్లో తిరుగుతూ కేరింతలు కొట్టారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ పార్కులో హోలీ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని యువతీ యువకులు, చిన్నారులు, పట్టణ ప్రజలు ఉత్సాహంగా అక్కడ ఏర్పాటు చేసిన రంగులు చల్లుకొని ఎంజాయ్ చేశారు. డీజే సౌండ్‌కు డ్యాన్సులు చేశారు. వేడుకల అనంతరం విందు వినోదాల్లో మునిగితేలారు.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్





వనపర్తి పట్టణంలోని రాజీవ్ చౌరస్తా వద్ద హోలీ సంబురాల్లో సెల్ఫీ తీసుకుంటున్న యువతీయువకులు



వనపర్తి పట్టణంలోని జంగిడి పురం కాలనీలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



వనపర్తి పట్టణంలోని న్యూటౌన్ పార్కులో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



జోగులాంబ గద్వాల జిల్లా రాజోలిలో గురువారం అర్ధరాత్రి కాముడి దహనం చేస్తున్న యువకులు



వనపర్తి పట్టణంలోని న్యూటౌన్ పార్కులో డ్యాన్స్ చేస్తున్న మహిళలు



గద్వాల పాత హౌసింగ్‌బోర్డు కాలనీలో హోలీ ఆడుతున్న చిన్నారులు, బాలికలు



నాగర్‌కర్నూల్ పట్టణంలో రంగులు చల్లుకుంటున్న బాలికలు





వనపర్తి పట్టణంలోని న్యూటౌన్ పార్కులో కేరింతలు కొడుతూ సంబురాలు జరుపుకొంటున్న యువతీయువకులు, పట్టణ ప్రజలు

పాము కాటుకు మహిళ మృతి

- గట్టు మండలం రాయపురంలో ఘటన

7

కొనసాగుతున్న వెంకన్న బ్రహ్మోత్సవాలు



వట్టెం వెంకన్న ఆలయంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

బిజినేపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు శుక్రవారం భక్తులు స్వామివారి ఎదుర్కోలు వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఉదయం 6 గంటల నుంచి ఒంటి గంట వరకు అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి ఎదుర్కోలు ఉత్సవం, పూర్ణాహుతి జరిపించారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అనంత నరసింహారెడ్డి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త నందడి ప్రతాప్‌రెడ్డి, కమిటీ సభ్యులు కొత్త చంద్రారెడ్డి, నందడి నరేందర్‌రెడ్డి, వడ్ల భాస్కరాచారిలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జగదీష్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆ పార్టీ నేతలు ఆందోళనకు దిగారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట బైటాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ హనుమంతరావు, మాట్లాడుతూ ప్రజల తరుపున ప్రశ్నించిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం అసెంబ్లీ చరిత్రలోనే చీకటి రోజని అన్నారు. అసెంబ్లీలో ప్రజల సమస్యలపై మాట్లాడే అవకాశం ప్రతిపక్షాలకు లేకుండా చేస్తున్నారని, పథకం ప్రకారం ముందే బీఆర్ఎస్ శాసనసభ్యుడిని సభ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపించారు. స్పీకర్ తక్షణమే స్పందించి ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, లేకపోతే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా అగ్రహానికి గురి కాకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీశైలం, బిజినేపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ పట్టణంలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సీఎం ఫొటోలు మార్ఫింగ్ చేశారని పోలీసులకు ఫిర్యాదు



టుటౌన్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీసేలా కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు సీఎం ఫొటోలు మార్ఫింగ్ చేసి, ఫేక్ వీడియోలు పోస్ట్ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎజాజొద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. సీఎం ప్రతిష్ఠను దిగజార్చేలా బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.విజయ్‌రావు, నాయకులు డాక్టర్ కందుల మచ్చు, కొట్టల యాదగిరి, రవికిరణ్, మురళి, అనిల్, వర్ధన్, అఖిలు ఇష్టానుసారంగా సామాజిక మాధ్యమాలలో తప్పుడు పోస్టులు చేసి వైరల్ చేశారన్నారు. వీరిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. వెంటనే చర్యలు తీసుకుని మరోసారి ఇలాంటి ఫేక్ వీడియోలు, మార్ఫింగ్ ఫొటోలు పోస్ట్ చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు మహ్మద్ జాహెద్‌ఉల్లా, మహ్మద్‌అమీర్‌సోహెల్ ఉన్నారు.

నిప్పు అంటుకొని మామిడి చెట్లు దగ్ధం


కాలిపోయిన మామిడి తోట

వీపనగండ్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన ఎత్తం నాగేష్‌కు చెందిన మామిడి చెట్లు డ్రిప్పు వైరుకు శుక్రవారం నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమయ్యాయి. 40 మామిడి చెట్లు, వైరు కాలిపోయిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రమాదవశాత్తు ప్రతీ ఏటా కాపుకొచ్చిన మామిడి చెట్లు కాలిపోతుండటంతో పూర్తిగా నష్టం వాటిల్లుతోందని వాపోయాడు.


ఊట్కూర్‌లో 50 గొర్రెపిల్లల సజీవ దహనం

- రూ.నాలుగు లక్షల నష్టం


ఊట్కూర్‌లో ఓబ్లపూర్ రోడ్డు సమీపంలో మంటల్లో కాలుతున్న గొర్రెపిల్లలు

ఊట్కూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జాలిలో వేసి పెంచుతున్న మండల కేంద్రానికి చెందిన 50 గొర్రెపిల్లలు సజీవదహనం అయ్యాయి. గొర్రెల కాపరికి దాదాపు నాలుగు లక్షల రూపాయల వరకు నష్టం జరిగిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం ఊట్కూర్ మండల కేంద్రం సమీపంలోని ఓబ్లపూర్ పొలాల్లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నారాయణ పేట జిల్లా ఊట్కూర్ గ్రామానికి చెందిన కుర్వ అయిలప్ప, బలరాం, తిప్పన్న జగన్నప్ప, కొండప్పలకు చెందిన 54 గొర్రె పిల్లలను ఓబ్లపూర్ రోడ్డుకు అంచున ఉన్న పొలంలో ప్రతీ రోజు మాదిరిగానే జాలి కట్టి పెంచుతున్నారు. శుక్రవారం సైతం గొర్రె పిల్లలను జాలిలో పెట్టి మేత వేసి వెళ్లడం జరిగింది. ఎలా అంటుకుందో తెలియది కాని జాలిమొత్తం మంటలు అంటుకుని గొర్రెపిల్లలు అరుస్తుండటంతో దారి వెంట పోయేవారు చెప్పారు. తిరిగి వచ్చి చూడగా పెద్ద ఎత్తును మంటలు అంటుకుని 50 గొర్రెపిల్లలు మంటల్లో సజీవదహనం అయ్యాయి. నాలుగు గొర్రె పిల్లలు మాత్రమే కాపా డగలి గారు.

ఈ విషయం పశువైద్య అధికారికి చెప్పడంతో ఆయన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి పంచనామా నిర్వహించారు.



1928లో రచించిన బసవరాజీయం పుస్తకం


1933లో గుంటూరు వీరరాఘవశాస్త్రి రచించిన శతకరత్నాకరం



శ్రీదేవిభాగవతం, తెలుగు నిఘంటువు


చెన్నిపాడు గ్రంథాలయంలో పుస్తక భాండాగారం

'ఉద్యమ' ఊపిరి

● యువరక్తమే నాటి గ్రంథాలయానికి పునాది

- రజాకారుల గుండెల్లో గునపం.. చెన్నిపాడు గ్రంథాలయం
- సత్యాగ్రహంతో పెల్లుబికిన స్వాతంత్ర్యోద్యమ జ్వాల
- చెన్నిపాడు కేంద్రంగా గోల్కొండ పత్రిక పంపిణీ
- తెలంగాణ చరిత్ర పుస్తక భాండాగారం
- నేడు ప్రభుత్వ ప్రోత్సాహం లేక వెల వెల..
- నిర్వహణకు నిధుల్లేక బోసిపోయిన గ్రంథాలయం
- ప్రస్తుతం పత్రికను కొనలేని స్థితి..

అలంపూరు చౌరస్తా, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నాడు గ్రంథాలయ స్థాపనకు యువత నడం బిగించింది. చందాలు వేసుకుని మరీ గ్రంథాలయాన్ని స్థాపించి నడిపించారు. నాటి నుంచి వారోత్సవాలు జరుపుకుంటూ హేమాహేమీల ప్రశంసలందుకుంది. యువకుల్లో రాజకీయ చైతన్యం రగిలించి రజాకారుల గుండెల్లో ఫిరంగులు పేల్చిన కథనాలతో నిండిఉన్న పుస్తక భాండాగారం ఈ గ్రంథాలయ గొప్పతనం. సురవరం ప్రతాపరెడ్డి స్థాపించిన గొల్కొండ దినపత్రికను ఇదే గ్రంథాలయం నుంచి పంపిణీ చేయించి రజాకారుల నిజస్వరూపాన్ని నలుదిక్కులా ప్రతిధ్వనింపజేసిన చెన్నిపాడు గ్రంథాలయం నేడు బోసిపోతోంది. ఇలాంటి చారిత్రక గ్రంథాలయాలు నడిగడ్డలో ఎన్నో ఉన్నాయి. అంతటి ప్రాముఖ్యత కలిగిన గ్రంథాలయాలు నేడు బోసిపోవడం గమనార్హం. కనీస నిర్వహణ నిధులు రాక ఆదరణ కోల్పోతున్నాయి. భవిష్యత్ తరాలకు జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని అందించాల్సిన పుస్తకాలకు చెదలు పడుతున్నాయి.

గ్రంథాలయ స్ఫూర్తితో స్వాతంత్ర్యోద్యమ బాట..


1934లో చెన్నిపాడు గ్రామంలో కొత్తింటి శివారెడ్డి, టి.సోమిరెడ్డి తదితరులంతా కలిసి సరస్వతీ పుస్తక విలాస్ ప్రారంభించారు. ఆ తర్వాత భారతదేశంలో తీవ్ర రాజకీయ పరిణామాలు చోటు చేసుకోవడంతో చెన్నిపాడు గ్రంథాలయ కార్యకర్తలు స్వాతంత్ర్య ఉద్యమానికి వెళ్లారు. దీంతో మూడేళ్లపాటు నడిచిన సరస్వతీపుస్తక విలాస్ మూతపడింది. 1942 తర్వాత ప్రజలలో స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి రగులుతున్న సమయంలో రాజకీయ చైతన్యం కోసం పత్రికల ఆవశ్యకత పెరిగింది. దీంతో చెన్నిపాడు గ్రామంలో కొందరు యువకులు సమావేశమై 25-1-1946లో కొన్ని గ్రంథాలను సంపాదించి, ఆంధ్రయువజన గ్రంథాలయాన్ని స్థాపించారు. దీనికి అధ్యక్షుడిగా కె. రామచంద్రరెడ్డి, కార్యదర్శిగా ఆర్.నాగిరెడ్డి సభ్యులుగా సంజీవరెడ్డి, సోమిరెడ్డి, కాంతరెడ్డి, హనుమంతరెడ్డి, తదితరులు ఏర్పాటయ్యారు. కానీ ఆ రోజుల్లో గ్రంథాలయాన్ని నడుపుటకు ఆర్థిక వనరులు లేకపోవడంతో అక్కడే ఖాదీ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించారు. ఇది తెలిసిన నిజాం ప్రభుత్వం సహాయ నిరాకరణ చేసింది. అయినా వెనకడుగు వేయకపోగా నాణ్యమైన ఖాదీ తయారు చేస్తూ అందరిలో స్ఫూర్తి నింపారు. ఇంతలోనే తెలంగాణలో 'అంజుమనె-ఇతైహదుల్- మూసరమీన్' సంస్థ ప్రాబల్యం పెరిగి రజాకార్ల ఆగాడాలు పెచ్చు మీరాయి. సురవరం ప్రతాపరెడ్డి స్థాపించిన గొల్కొండ దినపత్రికను ఇదే గ్రంథాలయం నుంచి పంపిణీ చేయించి రజాకారుల నిజస్వరూపాన్ని నలుదిక్కులా ప్రతిధ్వనింపజేశారు. ఇదే తరుణంలో 'స్టేట్ కాంగ్రెస్' ఉద్యమం తీవ్ర రూపం దాల్చింది. 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా.. రజాకార్ల ప్రాబల్యంతో హైదరబాదు రాష్ట్రంలో వేడుకలు జరగలేదు. దీంతో పల్లెపల్లెలో సత్యగ్రహాలకు పిలుప నిచ్చారు. అలం పూర్ తాలూకాకు రాజ కీయ కేంద్రంగా ఉన్న చెన్ని పాడులో వందలాది మంది తాలూకా వ్యాప్తంగా ఉన్న యువకులు సత్యగ్రహం చేశారు. నిజాంకారులు అరెస్టులు చేస్తారన్న సమాచారంతో అప్పటి హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ కార్యాచరణ సమితి వారి ఆదేశాలతో సమీపంలోని కర్నూలు నగరంలో తలదాచుకొని మారువేషాల్లో వచ్చి ఉద్యమం తీవ్రతరం చేయాలన్న ఆదేశాలు రావడంతో చెన్నిపాడు గ్రంథాలయం ఆగిపో యింది. 1948 సెప్టెంబరు 12న పోలీస్ చర్యలతో రజాకార్లు తోక ముడిచారు. అదే మాసం 17న చెన్ని పాడు గ్రంథాలయం ఎదుట జాతీయ జెండా ఎగురవేశారు.



గ్రంథాలయ స్వర్ణోత్సవాలలో పాల్గొన్న కుడి నుంచి వరుసగా కుర్చున్నవారు డాక్టర్ ఎల్లారి శివారెడ్డి, పాగ పుల్లారెడ్డి, సినారె, గడియారం రామకృష్ణ శర్మ

చైతన్య దీపికలు..

ఆ సమయంలో నైజాం పాలనలో తెలంగాణ ప్రజలకు రాజకీయ చైతన్యం కల్గించేందుకు ఆంధ్ర పితమహాశ్రీ మాడపాటి హనుమంతరావు పంతులు తమ సహచరులచే ఆంధ్రోద్యమం ప్రారంభించారు. దీని ఫలితంగానే తెలంగాణ నలుమూలల్లో గ్రంథాలయాల ఏర్పాటు జరిగింది. ఇదే ఉద్యమమే రాను రాను బలపడి స్టేట్ కాంగ్రెస్ సంస్థగా ఏర్పడింది. మొట్టమొదటిసారిగా మన ప్రాంతంలో దుంపల రామిరెడ్డి తన సొంత గ్రామమైన ఉండవల్లి గ్రామంలో 1926లో సరస్వతీ పుస్తక భాండారం స్థాపించారు. అంతకు ముందు 1896లో అలంపూర్ పణ్యక్షేత్రం నందు ప్రౌఢ సరస్వతీ గండ్రకోట కుమార స్వామి శాస్త్రిపాదులు బాల బ్రహ్మేశ్వర అన్నదాన సంస్థను ప్రారంభించి దీనికి అనుబంధంగా బ్రహ్మవిద్యావిలాస పుస్తక భాండాగారాన్ని ప్రారంభించారు. ఇందులో సంస్కృత భాషలోని వేద, వేదాంగ, శాస్త్ర, పురాణ, ఇతిహాస, కావ్య మొదలగు గ్రంథాలు ఉంచారు. అయితే కుమార స్వామి 1917లో మరణించాక మూతపడింది.


మినిట్స్ పుస్తకంలో సంతకం చేస్తున్న గడియారం రామకృష్ణశర్మ

'గడియారం'తో పునఃప్రారంభం

తిరిగి 30-10-1950న మళ్లీ అదే యువకులు కలిసి గడియారం రామకృష్ణ శర్మ అధ్యక్షతన 258 పుస్తకాలతో, గొల్కొండ పత్రిక వ్యవస్థాపకుడు సురవరం ప్రతాపరెడ్డి, కర్నూలు ఆంధ్ర గ్రంథాలయ నిర్వాహకులు మన్నవ వెంకట్రామయ్యలు గ్రంథా లయాన్ని పునఃప్రారంభిస్తూ వారి రచనలను అంద జేశారు. కాలానుగుణంగా గ్రంథాలయ నిర్వహణ కష్ట తరం కావడంతో కిరోసిన్, చక్కెర తదితర నిత్యావసర సరుకులు విక్రయించి వాటిపై వచ్చే ఆదాయంతో ఆంధ్ర ప్రభ, గోల్కొండ దినపత్రికలు, సుజాత, దేవసేవ, రామకృష్ణప్రభ మొదలగు మాస పత్రికలతో పాటు ఉ ర్దూ పత్రికలు కూడా తెప్పిస్తూ గ్రంథా లయాన్ని నడిపారు. గ్రంథాలయ నిర్వహ ణకు రైతులు కూడా తమ వం తు సహాయంగా ధాన్యం అమ్మ గా వచ్చిన సొమ్ములో సుంకం గా కాస్తా సొమ్ము చెల్లించేవారు. తెనాలి వాస్త వ్యులు, సుప్రసిద్ధ పశువైద్య చికిత్సా నిపుణులు శ్రీరా ములు చౌదరి ఆధ్వ ర్యంలో 1953లో వనపర్తి పట్టణంలో నిర్వహించిన పశువైద్య శిబిరానికయ్యే ఖర్చంతా చెన్నిపాడు గ్రంథాలయమే భరించింది. ప్రతిగా పశువులకు అవసరమయ్యే మందులను ఉచితం గా ఇవ్వడంతో తాలూకాలో వివిధ గ్రామాలకు ఆ మం దులను అందించారు. అదే సమయంలో హైదరాబాదు ప్రభుత్వం గ్రామీణ వైద్య చికిత్సా పథకం ప్రవే శపెట్టినప్పుడు గ్రంథాలయ కార్యకర్త రావిచెట్టు నాగిరెడ్డి శిక్షణ పొంది గ్రంథాలయమే కేంద్రంగా వివి ధ గ్రామాల ప్రజలకు వైద్యచికిత్సలు చేశారు. అలా వార్షికోత్సవాలకు పరుగులు పెట్టింది. దాదాపు 1962 వరకు గడియారం రామకృష్ణ శర్మ ప్రతి వార్ని కోత్సవానికి వచ్చేవారు. ఆయనతో పాటు డాక్టర్ సి. నారాయణరెడ్డి, మాడ్గుల నాగఫణిశర్మ, 1962లో అప్ప టి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య, పాగపు ల్లరెడ్డి, డాక్టర్ ఎల్లారి శివారెడ్డి, సురవరం పుష్పల తమ్మ, కేజీ గంగాధర్‌రెడ్డి, కవులు దివాకరుల వెంకట అవధాని, కోదాడ నారాయణరావు, యల్లాప్రగడ శీత కుమారి, ప్రొఫెసర్ నాయిని కృష్ణకుమారి, యశోదరెడ్డి, తెలుగు కవి శివారెడ్డి, హీరాలాల్, నాయకులు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి, సమరసింహారెడ్డి, ఎంపీలు జితేందర్‌రెడ్డి, రావుల రవీంద్రనాథ్‌రెడి, మాజీ మంత్రి చరకోల లక్ష్మారెడ్డి స్వర్ణోత్సవ సంచిక విడుదలకు వచ్చారు. ప్రముఖు లెందరో వచ్చి సందర్శించారు.

ప్రాచీన పుస్తక భాండాగారం

ఇక్కడ అత్యంత ప్రాచుర్యం పొందిన వేయి పడగలు, మహాభారత భాగవత రామాయణ ఇతిహాస గంధ్రాలు, ధర్మసింధు, నిర్ణయసింధు, సురవరం రచన లు, విజ్ఞానసర్వస్వములు 12భాగాలు, విజ్ఞానకోశాలు, విజ్ఞాన నిఘంటువులు, నాలుగువేదాలు, పశువైద్య చింతామణి, చలంగారి రచనలు, జాషువ గారి రచనలు, శ్రీశ్రీగారి రచనలు, కాశీమజిలీ కథలు, తెలంగాణ శాసనాలు, అలంపూర్ చరిత్ర లాంటి రచనలతో పాటు నవలలు, వేదంతాలు, పద్యకావ్యం, వచనగ్రంథాలు, వివిధాలు, చరిత్ర, జీవితములు, రాజకీయం, బాలస హిత్యం, కవిత్వాలు, కవితలు, విజ్ఞానం, కథలు, పరామర్శలు మొదలగు రచనలు ఎన్నో ఉన్నాయి. ఇంత ప్రాచుర్యం పొందినా నేటికి 3500 పుస్తకాలతో విరాజిల్లుతున్నా. ప్రోత్సాహం కోసం ఎదురు చూస్తున్నది చెన్నిపాడు గ్రంథాలయం.

పత్రికలు తెప్పించలేని స్థితిలో ఉన్నాం



1974 నుంచి గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నా. కొన్ని వేల పుస్తకాలున్నా సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నాం. కనీసం పత్రికలకు కూడా బిల్లులు రా నందున తెప్పించలేకపోతున్నాం. ఇక విద్యుత్ వినియోగం కోసం, ఫర్నీచర్ కోసం, మరిన్ని పుస్తకాలకై నిధులు మంజూరు చేస్తే బాగుంటుంది. వారోత్సవాలకు నిధుల్లేక జరుపుకోలేకపోతున్నాం. పఠనంపై ఉన్న మక్కువతో ఉన్న పుస్తకాలను కాపాడుకుంటున్నా.

- ఆంధ్ర యువజన గ్రంథాలయ కార్యదర్శి జి.ఈశ్వరరెడ్డి

కాపాడుకుంటాం



ఇలాంటి చరిత్ర కలిగిన గ్రంథాలయాలను కచ్చితంగా కాపాడుకుంటాం. ఎంతో చరిత్ర కలిగిన చెన్నిపాడు లైబ్రరీకి మరిన్ని పుస్తకాలకు సిఫారసు చేస్తాం. గ్రామాన్ని సందర్శించి అవసరమైన సామగ్రి, సౌకర్యాల ఏర్పాటుకు ప్రభుత్వంతో మాట్లాడి నిధులు విడుదల చేయిస్తాం.

- నీలి శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయ చైర్మన్

ప్రభుత్వ సహకారం అందించాలి



గత కొన్నేళ్లుగా ప్రభుత్వాల నుంచి కనీస సహకారం కరువైన కారణంగా గ్రంథాలయాలు కొనసాగలేని స్థితిలో ఉన్నాయి. యువకులంతా ఆండ్రాయిడ్ మొబైల్స్ వెంట పరుగులు పెడు తున్నారు. నేటి యువతను ఆకట్టుకునేలా గ్రంథాల యాల్లో ప్రాచీన గ్రంథాలను, రచనలను డిజిటల్ పఠనం ఏర్పాటు చేయాలి. ఆనాటి రచనలను నేటి తరానికి తెలిసేలా పాఠ్యాంశాలలో చేర్చాలి.

- సంపత్‌రెడ్డి, రైతుసంఘ అధ్యక్షుడు, చెన్నిపాడు గ్రామం

కాముని కాష్టంలో ఉల్లీ, గెన్సుగడ్డలు

- హోలీ సంబురాల్లో కొనసాగుతున్న ఆచారం
- వాటిని తింటే కామక్రోదాలు తగ్గుతాయంటున్న పెద్దలు


పేటలో కాముని కాష్టంలో గెన్సు గడ్డలు కాలుస్తున్న యువకులు


గెన్సు గడ్డలు

నారాయణపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కామ దహనం చేసిన అగ్నిగుండం (కాష్టం)లో ఉల్లీ గడ్డలు, గెన్సు గడ్డలను వేసి కాల్చారు. గురువారం అర్ధరాత్రి కామ దహనం చేసిన తర్వాత శుక్రవారం ఉదయమే ఆ కాముని కాష్టంలో ఉల్లీ గడ్డలు, గెన్సుగడ్డలను కాల్చడం ఆచారంగా వస్తున్నది. వాటిని కాల్చిన అనంతరం ఇళ్లకు తీసుకెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి ఆరగించారు. హోలీ సంబురాల్లో కొనసాగుతున్న ఈ ఆచారం కర్ణాటక సరిహద్దు జిల్లా కేంద్రమైన నారాయణపేట ప్రాంతంలో కొనసాగుతూ వస్తుండటం విశేషం.

ప్రతీ సంవత్సరం హోలీకి ఓరోజు ముందు అర్ధరాత్రి కాముని దహనం వీదిలో చేశారు. యువకులు కేరింతలతో ఆనందోత్సవాల మధ్య కట్టెల మండికి తరలివెళ్లి పెద్దఎత్తున కట్టెలను తీసుకువచ్చి తమతమ వాడల్లో కామ దహనం చేశారు. ముఖ్యంగా మనుషుల్లో ఉన్న కామక్రోదం తగ్గాలని ఆ కాంక్షిస్తూ కాముని దహనం చేసిన మంటల్లో కాల్చిన ఉల్లీ, గెన్సుగడ్డలను ఆరగించడం పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం. శుక్రవారం ఆనందోత్సవాల మధ్యన విధిగా కాముడి దహన సంస్కార కార్యక్రమాలను చేపట్టి అగ్నిగుండంలో కాల్చిన ఉల్లీ, గెన్సుగడ్డలు, వట్టి కొబ్బెరలను ఆరగించి హోలీ వేడుకలను జరుపు కున్నారు.

ఎండుతున్న పంటలు

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో గతంలో ఆరుతడి పంటల సాగు అధికంగా ఉండేది. నీటి వనరుల లభ్యత పెరిగిన తర్వాత ఆరుతడి పంటలు తగ్గి, కేవలం వరిపై రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అలాగే ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుండటం, ఆరుతడి పంటల మార్కెట్ ధరల్లో హెచ్చుతగ్గులు ఉండటంతో రైతులు అనివార్యంగా వరిపై ఫోకస్ పెడుతున్నారు. అలాగే పంటల ప్రణాళిక, యాసంగిలో ఏ పంటలు సాగుచేయాలి? నీటి వనరుల లభ్యత ఎలా ఉంటుందనే విషయంలో వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల నుంచి సరైన అవగాహన కార్యక్రమాలు ఉండటం లేదు. గత సంవత్సరం యాసంగిలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో 7.27 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైతే.. అందులో వరిసాగు 4.69 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది 9.19 లక్షల ఎకరాల్లో పంటలను సాగు చేయగా, కేవలం వరి మాత్రమే 5.86 లక్షల ఎకరాల్లో సాగైంది. గత సంవత్సరం యాసంగిలో సాగైన వరితో పోల్చితే ఈ ఏడాది 1.17 లక్షల ఎకరాల్లో వరి అధికంగా సాగు చేశారు. అలాగే అన్ని జిల్లాల్లో ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. అయినప్పటికీ నీటి ఎద్దడి తీవ్రంగా మారింది. వరికి నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. నీటి ఎద్దడి ఏర్పడితే కంకులు సరిగా రావు. అలా గే పండిన పంటలో గింజ బలంగా లేక, తాలు ఎక్కువగా వస్తుంది. ఆరుతడి పంటలకు నీటి అవసరం తక్కువగా ఉంటుంది. అయితే నీటి లభ్యతను ఆధారంగా చేసుకుని.. రైతులను ఆరుతడి పంటలవైపు ప్రోత్సహించాల్సిన అధికారులు అవేమి పట్టించుకోవడం లేదు. రైతులు అవగాహన లోపంతో వరిసాగు ఎక్కువగా చేయడంతో ప్రస్తుత పరిస్థితి ఎదురైందని చెప్పొచ్చు.


వనపర్తి జిల్లా అన్నారం తండాలో ఎండిన వేరుశనగ పంటను పశువులకు వదిలేసిన రైతు (ఫైల్)


నారాయణపేట జిల్లా సుద్దబండ తండాలో ఎండిన వరిని పశువుల మేతకు వదిలేసిన రైతులు (ఫైల్)

గతేడాది.. ఈ ఏడాది యాసంగి సాగు వివరాలు..

జిల్లా	గతేడాది సాగు	ఈ ఏడాది	పెరిగిన విస్తీర్ణం
మహబూబ్‌నగర్	125705	144749	19044
నారాయణపేట	126380	141067	14687
నాగర్‌కర్నూలు	243162	312732	69570
వనపర్తి	124532	189355	64823
గద్వాల	107871	131606	23735
మొత్తం	727650	919509	191859

పెరిగిన విస్తీర్ణంలో 1.91 లక్షల్లో వరివాటానే 1.17లక్షల ఎకరాలు

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇలా..

ప్రస్తుతం ఎండుతున్న పంటల్లో వరి శాతం అధికంగా ఉంది. దేవరకద్ర మండలంలోని డోకూరు, గోప్లాపూర్ గ్రామాల్లో బోర్ల కింద సాగు చేసిన వరి ఎండిపోతోంది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద మూడు రోజుల నుంచి నీటి విడుదల చేయడం లేదు. దీంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. కేటీదొడ్డి మండంలోని ర్యాలంపాడు ప్రధాన కాలువ ప్యాకేజీ 104 పరిధిలోని కొండాపురం, గువ్వలదిన్నె, మైలగడ్డ, ఇరికిచేడు, ఉమిత్యాల శివారులో వరిని పశువులకు వదిలేస్తున్నారు. నవాబుపేట మండంలో రుద్రారంలో పంట ఎండిపోవడంతో రైతు గొల్ల యాదయ్య 2 ఎకరాల వరిని గొర్ల మేతకు వదిలేశాడు. జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లి, పోలేపల్లి పరిసరాల్లో బోర్లు ఎండటంతో వరిని గొర్రెలు, మేకలకు వదిలేశారు. చారకొండ మండలంలోని సిర్సనగండ్ల, చంద్రయాన్‌పల్లి గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటి, 23 ఎకరాల్లో వరి ఎండిపోయింది. వనపర్తి జిల్లా పానగల్ మండలంలోని అన్నారం తండాల్లో వేరుశనగ పంట ఎండిపోవడంతో పశువుల మేతకు వదిలేశారు. మద్దూరు మండలంలో కూడా వరి పంట ఎండుముఖం పడుతోంది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా దాదాపు 100 ఎకరాల్లో వరి ఎండిపోయింది. మహ్మదాబాద్ మండలంలో దాదాపు 300 ఎకరాల్లో, గండీడ్ మండలంలో దాదాపు 50 ఎకరాల్లో వరి ఎండింది.

వర్షపాతం వివరాలు

జిల్లా	సాధారణ వర్షపాతం	నమోదైన వర్షపాతం
మహబూబ్‌నగర్	596.7 మి.మీ	951.1 మి.మీ
నారాయణపేట	576.1 మి.మీ	978.3 మి.మీ
నాగర్‌కర్నూలు	600.2 మి.మీ	921.8 మి.మీ
వనపర్తి	591.2 మి.మీ	988.0 మి.మీ
గద్వాల	540.3 మి.మీ	821.0 మిమీ

క్రైం కార్నర్

పాము కాటుకు మహిళ మృతి

▸▸ భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు



సరోజమ్మ (ఫైల్)

గట్టు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాయపురం గ్రామానికి చెందిన సరోజమ్మ (50) పాము కాటుకు గురై మృతి చెందింది. ఈమె భర్త హన్మంతు రోజువారిగానే గురువారం పొలం పనులకు వెళ్లారు. పనులు పూర్తయిన అనంతరం సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో కట్టెలు ఏరు తుండగా పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం గట్టు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. ఆమెకు కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై భర్త హన్మంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కేటీ మల్లేష్ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం

నవాబ్‌పేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చలేక ఓ యువకుడు తాను నడుపుతున్న బొలెరో వాహనానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ విక్రం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన కొంగల బాలరాజు తండ్రి రామయ్య గత నాలుగు సంవత్సరాల క్రితం చనిపోయాడు. నాటి నుంచి తీసుకున్న అప్పులు అధికమవ్వడంతో ఈనెల 13న రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంటినుంచి బయటకు వెళ్లొస్తానని చెప్పి బయలుదేరాడు. కొద్ది సేపటికి గ్రామ సమీపంలోని చౌడూర్ మట్టి రహదారిపై తన బొలెరో వాహనాన్ని ఆపి వెనకి భాగంలో ఉరేసుకున్నాడు. తాను చనిపోతూ గ్రామానికి చెందిన స్నేహితులకు వాట్సాప్‌లో చనిపోతున్నట్లు సెల్ఫీలు పెట్టడంతో ఆందోళన చెందిన వారు తల్లి యాదమ్మకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. చేసిన అప్పులే తన బిడ్డ ప్రాణాలు తీశాయని ఆవేదన వ్యక్తం చేసింది. తల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అడవి పంది దాడిలో ఒకరికి గాయాలు



అడవి పంది దాడిలో గాయపడిన ఫీల్డ్ అసిస్టెంట్

వీపనగండ్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అడవి పంది దాడిలో ఫీల్డ్ అసిస్టెంట్‌కు గాయాలైన సంఘటన వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల పరిధిలోని వల్లభాపూర్ గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వల్లభాపూర్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ రెడ్యానాయక్ ఉదయం ఉపాధి పనుల దగ్గరికి వెళ్లాడు. పనులు చేస్తున్న కూలీల ఫొటోలు తీసుకుని బైక్‌పై వెళ్తుండగా మార్గ మధ్యంలో అడవి పంది దాడి చేసింది. గాయపడిన రెడ్యానాయక్‌ను కేతేపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నట్లు తెలిపారు.

మాచర్ల ఉన్నత పాఠశాలలో
కంప్యూటర్లు ధ్వంసం

● పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రధానోపాధ్యాయుడు



మాచర్ల ఉన్నత పాఠశాలలో ధ్వంసమైన కంప్యూటర్ల దృశ్యం

గట్టు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలోని మాచర్ల ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు విలువైన కంప్యూటర్లను ధ్వంసం చేశారు. గదులకు తాళాలు వేసినప్పటికీ తలుపులను పగలగొట్టి అందులో ఉన్న రెండు కంప్యూటర్లను ధ్వంసం చేశారు. దీంతో పాటు బీరువాలోని స్పోర్ట్స్ సామగ్రిని కూడా ధ్వంసం చేశారు. అదేవిధంగా విద్యార్థులకు రోజువారిగా అందించే చిక్కీల డబ్బాలను ఎత్తుకెళ్లారని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రఘు తెలిపారు. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని చెప్పారు. ఈ సంఘటనపై చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామ నడి మధ్యలో ఉన్న ఈ పాఠశాలలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమని గ్రామస్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలను ఏఎస్ఐ అయ్యన్న తన సిబ్బందితో సందర్శించి ధ్వంసం అయిన కంప్యూటర్లను పరిశీలించారు.

బైక్ అదుపుతప్పి కిందపడి వ్యక్తి మృతి

బిజినేపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని శాయిన్‌పల్లి సమీపంలో బైక్‌పై వస్తున్న రమేష్ చారి(38) అనే వ్యక్తి బైక్ అదుపుతప్పి కిందపడి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన మృతుడు వనపర్తి నుంచి బిజినేపల్లి వైపు బైక్‌పై స్నేహితుడితో కలిసి వస్తున్న రమేష్‌చారి బైక్ అదుపు తప్పి కిందపడటంతో అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. 108కు సమాచారం ఇవ్వడంతో వెంటనే నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించనట్లు స్థానికులు తెలిపారు. మృతుడు మండల కేంద్రంలో ఉన్న బంగారం షాపులో పనిచేస్తుంటాడని తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరికి గాయాలు

మూసాపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అడ్డాకుల మండలం జాతీయ రహదారి పొన్నకల్ స్టేజీ వంతెన వద్ద శుక్రవారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడగా, ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. నంద్యాల నుంచి హైదరాబాద్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న బాషా అనే వ్యక్తి అదుపు తప్పి వాగు వంతెనను ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సకై ఎల్అండ్‌టీ అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు.

బొటానికల్ గార్డెన్‌కు ఐదేళ్లు..



పాఠ్యాంశాలలో ఉదాహరణగా వచ్చే మొక్కలను ప్రత్యక్షంగా చూసి నేర్చుకోవడంతో పాటు వాటిపై అవగాహన కల్పించుకోవడానికి విద్యార్థు లకు బొటానికల్ గార్డెన్ ఎంతో దోహదపడుతున్నది. నేర్చుకున్న వాటిని మొక్కలపై పరిశోధనలు చేయడానికి సైతం ఉపయోగపడుతుంది. అంత రించిపోతున్న మొక్కలను కాపాడుకోవడం, అన్ని రకాల మొక్కలను మిళితం చేసేందుకు ఈ గార్డెన్ ఎంతో ఉపయుక్తం. శాస్త్రీయ దృక్పథంతో బొటానికల్ గార్డెన్‌ను ఏర్పాటు చేసిన తీరు.. విద్యార్థులకు మేలు చేకూరుస్తోంది. 2019లో ముప్పావు ఎకరంలో ప్రారంభించిన బొటానికల్ గార్డెన్‌కు 2020 మార్చి 15, 16, 17 తేదీలలో తెలంగాణ ఆకృతితో రూపుదిద్దేందుకు మూడు రోజుల పాటు శ్రమించారు. 33 జిల్లాలతో కూడిన తెలంగాణ ఆకారాన్ని లేఅవుట్‌గా తీర్చిదిద్దారు. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐదున్నర ఎకరాల్లో ఈ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. సుమారు 650 జాతుల, ఏడు వేలకుపైగా మొక్కలు నాటారు. వాటి వివరాలు తెలిపేలా శాస్త్రీయనామం, నాటిన ప్రముఖుల వివరాలతో కూడిన క్యూ ఆర్ కోడ్‌ను కూడా ఏర్పాటు చేయడం ప్రత్యేకంగా నిలుస్తోంది. ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ బొటానికల్ గార్డెన్‌పై ప్రత్యేక కథనం..

● తెలంగాణ రాష్ట్ర ఆకృతిలో జడ్చర్లలో ఏర్పాటు

● మొక్కలు నాటిన ప్రముఖులు

● పరిశోధనలకు నిలయంగా తీర్చిదిద్దుతున్న కోఆర్డినేటర్ డాక్టర్ సదాశివయ్య



మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ సూర నరేశ్‌కుమార్ (ఫైల్)



బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన ఉదయ మెమోరియల్ హైస్కూల్ విద్యార్థులకు గార్డెన్ గురించి వివరిస్తున్న కోఆర్డినేటర్ డాక్టర్ సదాశివయ్య (ఫైల్)

జడ్చర్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రం ఆకారంలో రూపుదిద్దుకున్న బొటానికల్ గార్డెన్‌కు ఐదేళ్లు నిండాయి. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సదాశివయ్య నేతృత్వంలో బొటానికల్ గార్డెన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. 2019లో ముప్పావు ఎకరంలో ప్రారంభించిన బొటానికల్ గార్డెన్‌కు 2020 మార్చి 15, 16, 17 తేదీలలో తెలంగాణ ఆకృతితో రూపుదిద్దేందుకు మూడు రోజుల పాటు శ్రమించి 33 జిల్లాలతో కూడిన తెలంగాణ ఆకారాన్ని లేఅవుట్‌గా తీర్చిదిద్దారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కొన్ని జిల్లాల ప్రాముఖ్యతను తెలిపేలా ఆ జిల్లాను తీర్చిదిద్దారు. ఉదాహరణకు హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లోని బుద్ధవిగ్రహం ఉన్న విధంగా బొటానికల్ గార్డెన్‌లో సైతం హైదరాబాద్ జిల్లా ఆకారంలో బుద్ధవిగ్రహం ఏర్పాటు చేశారు. నాగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాల్లో నల్లమల అటవీ ప్రాంతం ఉండటంతో అటవీ మొక్కలు, జోగుళాంబ గద్వాల జిల్లాలో జోగుళాంబ అమ్మవారు ప్రాముఖ్యతను తెలిపేవిధంగా మొక్కలు నాటారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పిల్లలమర్రి ప్రాముఖ్యతను తెలిపేవిధంగా మర్రిచెట్లు నాటారు.

మొక్కలు నాటిన ప్రముఖులు



గార్డెన్‌ను సందర్శించిన తెలంగాణ అటవీ అకాడమీలో శిక్షణ పొందుతున్న బీట్ ఆఫీసర్లు(ఫైల్)

జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని తెలంగాణ ఆకారంలో ఏర్పాటు చేసిన బొటానికల్ గార్డెన్‌ను ఎందరో ప్రముఖులు సందర్శించి మొక్కలను నాటారు. వారిలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, పర్యావరణవేత్త వనజీవి రామయ్య దంపతులు మొక్కలు నాటారు. 2021 మార్చి 15న బొటానికల్ గార్డెన్ మొదటి ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. వీరితో పాటు న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్ ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ సూర నరేశ్‌కుమార్, బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ డాక్టర్ సంజప్ప మొక్కలు నాటిన వారిలో ఉన్నారు. ఇస్రో-ఎన్ఆర్ఎస్‌సీ(నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్రముఖ వృక్షశాస్త్రవేత్త ప్రొఫెసర్ పుల్లయ్యతో కలిసి మొక్కలు నాటారు. బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు డాక్టర్ రవికిరణ్, డాక్టర్ శంకర్, డాక్టర్ నాగరాజు మొక్కలు నాటారు. తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, అప్పటి కళాశాలల విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ దంపతులు, తెలంగాణ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి కార్యదర్శి కాళీచరణ్ ఖతార్లె, ఐఏఎస్ మొక్కలు నాటారు. అప్పటి హరితహారం ప్రత్యేక కార్యదర్శి ప్రియాంకవర్గీస్, ఐఆర్ఎస్ యాదగిరి, అప్పటి జిల్లా కలెక్టర్, ఎస్పీలు వెంకట్రావు, వెంకటేశ్వర్లు ఉన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో ఎండీ వైద్యాభ్యాసం చేస్తున్న వైద్యుల బృందం, కర్ణాటక యూనివర్సిటీ నుంచి ధార్వాడ్ వృక్షశాస్త్ర పీజీ విద్యార్థులు, తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో శిక్షణ పొందుతున్న అన్ని స్థాయిల అధికారులు, తెలంగాణ గురుకుల పాఠశాలల విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఎందరో బొటానికల్ గార్డెన్‌ను సందర్శించి మొక్కలు నాటిన వారిలో ఉన్నారు.

17న బొటానికల్ గార్డెన్ ఐదవ ఆవిర్భావ వేడుకలు

జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్ ఐదవ ఆవిర్భావ వేడుకలను కళాశాల ఆవరణలో నిర్వహించనున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య నేతృత్వంలో బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డాక్టర్ సదాశివయ్య ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఐదున్నర ఎకరాలలో 7వేలకు పైగా మొక్కలు

జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐదున్నర ఎకరాలలో బొటానికల్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. సుమారు 650 జాతుల మొక్కలను గార్డెన్‌లో ఏడు వేలకుపైగా మొక్కలను నాటారు. నాటిన మొక్కల వివరాలు తెలిపే విధంగా శాస్త్రీయనామం, నాటిన ప్రముఖుల వివరాలతో కూడిన క్యూ ఆర్ కోడ్‌ను ఏర్పాటు చేయడం ప్రత్యేకతగా నిలుస్తోంది. జన్మరాశులకు సంబంధించి ఒక్కో రాశికి చెందిన మొక్కను, 27 జన్మనక్షత్రాల కు ఒక్కో నక్షత్రమొక్క, పురాణ ఇతిహాసలలో ప్రస్తావించబడి పూజలు అందుకుంటున్న మొక్కలతో బొటానికల్ గార్డెన్‌ను తీర్చిదిద్దారు.

అలాగే అంతరించిపోతున్న మొక్కలు, అటవీ, అలంకరణ, స్థానీయం, కేవలం అడవులలో మాత్రమే పెరిగే మొక్కలు, పండ్లు, పూల మొక్కలు నాటారు. వీటితో పాటు కార్తీక వనం, పంచవటవనం, పవిత్రవనం, ఎర్రచందన వనం, సీగంధవనంను తీర్చిదిద్దారు.



బొటానికల్ గార్డెన్‌ను సందర్శించి మొక్కలు నాటి, నీరు పోస్తున్న బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ డాక్టర్ సంజప్ప (ఫైల్)

అంగరంగ వైభవంగా తిరుకల్యాణ మహోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ మండల పరిధిలోని మన్యంకొండ అలివేలు మంగతాయారు తిరుకల్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తుల మధ్య అమ్మవారి ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన శేషవాహనంలో వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగతాయారు దేవతామూర్తులను ఉంచి దేవస్థానంలోని గర్భగుడి నుంచి పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాల మధ్య ఊరేగిస్తూ కల్యాణ కట్ట వద్దకు తీసుకొచ్చారు.



కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు విచ్చేసిన భక్తులు

అమ్మవారికి ప్రత్యేక అభిషేకం



వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని అలంకరించిన ఆలయ పూజారులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ పట్టణంలోని వేంకటేశ్వర కాలనీలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం స్వస్తి శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, పాల్గునమాసం శుక్లపక్ష పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వాసవీ మహిళా సభ్యులు పూజలో పాల్గొన్నారు. భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు

కందూరు ఆలయంలో బ్రహ్మోత్సవ పూజలు



ప్రభోత్సవ పూజలో పాల్గొన్న గ్రామపెద్దలు, భక్తులు

మూసాపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అడ్డాకుల మండలం కందూరు రామలింగేశ్వర స్వామి ఆలయంలో జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున స్వామి వారికి ప్రభోత్సవ అభిషేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అందంగా అలంకరించిన ప్రభపై అర్చకులు అశ్వ వాహనాన్ని అధిష్ఠింప జేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు ప్రభపై ఉంచి యజ్ఞం నిర్వహించి మహామంగళ హారతి సమర్పించారు. ప్రభను ముందుకు లాగారు. శనివారం తెల్లవారు జామున రథోత్సవం ఉన్నందున రంగు రంగుల పూలదండలతో అలంకరించారు. ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరానున్నారు. ఈవో రాజేశ్వర్‌శర్మ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట శ్రీహరి, ఆలయ కమిటి అధ్యక్షుడు రవీందర్‌శర్మ, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

▸▸ రాకమకొండ తిరుమలనాథ స్వామి ఉత్సవాలు

హన్వాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాకమకొండ తిరుమలనాథ స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం స్వామికి పూజలు చేశారు. కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామికి దాసంగాలను నైవేద్యంగా పెట్టారు. మాధారం, యారోనిపల్లి గుట్టపై ఉన్న స్వామికి భక్తులు నైవేద్యం సమర్పించి స్వామిని దర్శించుకున్నారు. రథోత్సవం ఎంతో వైభవంగా నిర్వహించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. శుక్రవారం రాత్రి నుంచి రథోత్సవం కొనసాగింది. కాగా, ఎస్ఐ వెంకటేష్ రథోత్సవ కార్యక్రమానికి బందోబస్తును నిర్వహించారు.

తిరుమలనాథ స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి

తిరుమలనాథ స్వామిని శుక్రవారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. పార్టీ మండల అధ్యక్షుడు కరణకర్‌గౌడ్, నాయకులు కొండ లక్ష్మయ్య, నరేందర్, జంబులయ్య, చెన్నయ్య, శ్రీనువాసులు, సుధా, మానస, అనంతరెడ్డి, చిన్నచెన్నయ్య, నెహ్రూ మాజీ సర్పంచులు స్వామిని దర్శించుకున్నారు.



స్వామి వారి కల్యాణోత్సవం



రాకమకొండ తిరుమలనాథస్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఉత్సాహంగా హోలీ

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా హోలీ వేడుకలు
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు, యువతీయువకులు
- క్యాంపు కార్యాలయంలో రంగులు చల్లుకున్న ఎమ్మెల్యే, కార్యకర్తలు
- పదో బెటాలియన్‌లో శుభాకాంక్షలు తెలుపుకున్న కమాండెంట్‌లు
- ఉట్టి కొట్టిన గద్వాలలోని ఐడీఎస్‌ఎంటీ కాలనీవాసులు

గద్వాల/గద్వాల టౌన్/గద్వాల న్యూటౌన్/అయిజ/ఎర్రవల్లి/ రాజోలి గద్వాల అర్బన్/వడ్డేపల్లి/ గట్టు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను పట్టణ ప్రజలు శుక్రవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. చిన్నారులతో పాటు యువతీయువకులు, మహిళలు రంగులు చల్లుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉదయం 8గంటల నుంచి పట్టణంలోని అన్నివార్డులు, వీధులు, రోడ్లపై హోలీ సంబురాలు కనిపించాయి. పరస్పరం రంగులు చల్లుకుని, హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు గుంపులు గుంపులుగా తిరుగుతూ ఉత్సాహంగా కనిపించారు. హోలీ పండుగకు ముందురోజు రాత్రి ఆనవాయితీగా నిర్వహించే కామదహనం కార్యక్రమాన్ని పలు వార్డులు, వీధుల్లో యువకులు, మహిళలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. అంతకు ముందు రోజు పట్టణంలో పలుకాలనీలు కూడళ్లలో కామదహనం నిర్వహించారు. హోలీ సంబురాల నేపథ్యంలో పట్టణంలోని రోడ్లనీ మధ్యాహ్నం బోసిపోయి కనిపించాయి. కాగా, భోజనం విరామం అనంతరమే వ్యాపారాలు ప్రారంభించారు.

పదో బెటాలియన్‌లో...

● ఎర్రవల్లి వద్ద పదో బెటాలియన్‌లో కమాండెంట్ సాంబయ్య సిబ్బంది, చిన్నారులతో కలిసి హోలీని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఒకరికొకరు రంగులు చల్లుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో జేపీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సత్యసాయి పాఠశాలలో శుక్రవారం అన్యువల్ డే ను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పదో బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో అమీర్‌పాష, ప్రిన్సిపాల్ అరుణ ఉన్నారు.

ఉండవల్లి మండలంలో..

● అలంపూరు చౌరస్తా: ఉండవల్లి మండలంలో పుల్లూరు, తక్కశిల, కంచుపాడు, కలుగొట్ల, బొంకూరు, ఉండవల్లి తదితర గ్రామాల్లో హోలీ పండుగ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు వీధుల్లోకి వచ్చి కేరింతలతో రంగులు చల్లుకున్నారు. ముందురోజు రాత్రి కాముడి దహన వేడుకలు నిర్వహించారు.



ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి రంగులు పూస్తున్న కార్యకర్తలు, నాయకులు



హోలీలో గద్వాల పట్టణ వాకర్స్ అసోసియేషన్



గట్టులో రంగులు పూసుకుంటున్న మహిళలు



రాజోలి క్యాషియర్‌పేటలో హోలీ ఆడుతున్న మహిళలు



అయిజ కాంగ్రెస్ నాయకులతో కలిసి హోలీ సంబురాల్లో పాల్గొన్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్



ఉండవల్లి మండల కేంద్రంలో రంగులు పూసుకున్న యువకులు



కేటీదొడ్డిలో బృందంగా ఏర్పడి హోలీ వేడుకలో యువకులు





అయిజ: రంగులు చల్లుకుంటున్న నర్సింహకాలనీ చిన్నారులు, ఉత్సాహంగా పాల్గొన్న యువకులు



గట్టులో రంగులు వేసుకుంటూ నృత్యం చేస్తున్న యువకులు



గద్వాల ఐడీఎస్‌ఎంటీ కాలనీలో ఉట్టి కొడుతున్న మహిళలు



గద్వాల బీసీకాలనీలో హోలీ ఆడుతున్న మహిళలు, యువత



పదో బెటాలియన్‌లో కమాండెంట్ సాంబయ్య, సిబ్బంది

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ హేయమైన చర్య



దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పట్టణ ఎస్ఐ, పోలీసులు

● బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతు నాయుడు
● కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు

గద్వాల క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్పష్టమైన కారణం లేకుండా మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ సభ్యులు జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం హేయమైన చర్యఅని, ఇందుకు నిరసనగా జిల్లా కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా జిల్లా బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతునాయుడు మాట్లాడుతూ.. సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసినందుకు, కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక వైఖరికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈసందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుపడ్డారు. నిరసనకు అనుమతి ఇవ్వకుండా పోలీసులే అడ్డుపడటం విచారకరమన్నారు. పేరుకేమో ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకుంటూ ప్రజల తరపున మాట్లాడే బీఆర్ఎస్ పార్టీ సభ్యుల గొంతునొక్కడం ఏమిటని పోలీసులపై మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి పోలీసులు వత్తాసు పలుకుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో స్వేచ్ఛ మంటకలిసిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోనేష్, బీచుపల్లి, గంజిపేట రాజు, తిరుమలేష్, గోవర్ధన్, ఆటోమక్బూల్ ఉన్నారు.

బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ అరెస్ట్

బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్యను శుక్రవారం జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో పోలీసులు అరెస్ట్ చేసి అయిజ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేస్తున్నారని పోలీసులకు సమాచారం రావడంతో కుర్వ పల్లయ్యను అరెస్ట్ చేసి అయిజకు తరలించారు.

డాక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ

ధరూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని నీలోఫర్ హాస్పిటల్ హెచ్‌వోడీ డాక్టర్ సర్వేశ్వర్ రెడ్డి గురువారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా, ఆయన మృతదేహాన్ని ధరూర్ మండల పరిధిలోని గార్లపాడు గ్రామంలో శుక్రవారం కుటుంబసభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకుని గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దివంగత డాక్టర్ గార్లపాడు సర్వేశ్వర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలే వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ధరూర్‌లోని రఘువర్ధన్ తల్లి తెలుగు గోవిందమ్మ అనారోగ్యంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం కృష్ణారెడ్డి, సీతారాం రెడ్డి, మాజీ సర్పంచు రఘువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రఘువర్ధన్‌రెడ్డి, వంట భాస్కర్, హనుమంతు, దౌలు, రామకృష్ణ, వెంకట్రాములు, పరశు రాముడు కార్యకర్తలు ఉన్నారు.



గార్లపాడులో సర్వేశ్వర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదు

● గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హన్మంతు

కేటీదొడ్డి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అని గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హన్మంతు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ధరూర్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సమావేశ సభలో ఎమ్మెల్యే సదువొచ్చిన మాజీ ప్రజాప్రతినిధులకు పెద్దపీట వేశారని, సదువురాని మార్కెట్ యార్డ్ చైర్మన్‌ను దూరంగా కూర్చొబెట్టారని సోషల్ మీడియాలో నిరాధారణ ఆరోపణలు చేశారు. బీసీలు రాజకీయంగా ఎదగడానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సమన్యాయం పాటిస్తూ అడగకముందే అందరికీ పదవులు ఇచ్చి గౌరవంగా చూస్తున్నారు. ఎమ్మెల్యే ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు. రెండురోజుల క్రితం ధరూర్‌లో జరిగిన సమావేశానికి నేనే ఆలస్యంగా వెళ్లడం జరిగింది. సమావేశం చివరిలో వెళ్లడంతో ఎవ్వరు ఇబ్బంది పడకూడదని నేనే చివరగా కూర్చున్నాను. ఎమ్మెల్యే ముఖాలు చూసి కుర్చీలు వేస్తున్నారని ఆరోపించడం సమంజసం కాదని తెలిపారు.

ఎమ్మెల్యే మంచితనం, ఆదరణను ఓర్వ లేక కొంతమంది వ్యక్తులు ఈ విధంగా ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే వెంటనే మేమంతా ఉన్నాము.. అసత్య ఆరోపణలు చేసే ముందు నిజలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హన్మంతు మండిపడ్డారు.

బీసీ గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకి నోటిఫికేషన్

గద్వాల సర్కిల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఆంగ్ల మాధ్యమంలో మిగిలిపోయిన 6, 7, 8, 9వ తరగతి సీట్ల భర్తీకి కొరకు నోటిఫికేషన్ విడుదలైనట్టు జిల్లా కన్వీనర్ సి అనిలాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వచ్చే నెల 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. 6వ తరగతి ప్రవేశానికి 12 ఏళ్ల వయసు మించి ఉండరాదని వివరించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెండు సంవత్సరాల సడలింపు ఉందని తెలిపారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అదనపు బాధ్యతలతో ఇక్కట్లు

- జిల్లాలో అన్ని మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలే



వడ్డేపల్లి మండల విద్యాశాఖ కార్యాలయం

వడ్డేపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మండలాల్లో రెగ్యులర్ ఎంఈవోలు లేకపోవడంతో ఆ శాఖపై పర్యవేక్షణ కొరవడింది. విద్యాభివృద్ధి కార్యక్రమాల అమలు తీరు, పాఠశాలల నిర్వహణ, వసతులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, వంట ఏజెన్సీల బిల్లుల చెల్లింపు, సముదాయ సమావేశాలు, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించటం, తనిఖీలు, ఫిర్యాదుల పరిశీలన, విచారణ, ఉన్నతాధికారులకు సంధానకర్తగా వ్యవహరించటం వంటి అంశాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాల్సి ఉంది. మొత్తం 13మండలాలకు పూర్తిస్థాయిలో సీనియర్ ప్రధానోపాధ్యాయులనే తాత్కాలిక ఎంఈవోలుగా నియమించడంతో, మండల విద్యాశాఖకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారు.

త్వరలోనే నియమించే అవకాశం ఉంది

పదవ తరగతి పరీక్షల తర్వాత రెగ్యులర్ ఎంఈవోలను నియమించే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లాలోని 13 మండలాల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న వారికే ఎంఈవోల బాధ్యతలు అప్పజెప్పాము. ఎక్కడా విద్యాభివృద్ధికి ఆటంకం జరగకుండా పథకాలు అమలు పరుస్తున్నాం.

- మహ్మద్ అబ్దుల్ ఘని, డీఈవో

పన్ను కట్టలేదా.. నల్లా కట్



అయిజ పట్టణంలో నల్లా కనెక్షన్ తొలగిస్తున్న కమిషనర్, సిబ్బంది

అయిజటౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ప్రజలు సకాలంలో ఇంటి పన్ను చెల్లించాలని లేని పక్షంలో నల్లా కనెక్షన్ తొలగించాల్సిన పరిస్థితి వస్తుందని మునిసిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు హెచ్చరించారు. పురపాలక సంఘం, పట్టణ పరిధిలోని నివాస గృహ మరియు వ్యాపార సముదాయలకు సంబంధించిన ఇంటిపన్నులు మరియు కొళాయి పన్నులు ఈ నెలాఖరులోపు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. శుక్రవారం ఆర్వో లక్ష్మన్న, ఆర్ఐ విజయ్ బిల్ కలెక్టర్‌లు వార్డులలో తిరుగుతూ ఇంటి పన్నులు వసూలు చేశారు. బలిజపేటలోని ఓ ఇంటి యాజమాని పదేళ్లుగా ఇంటి బకాయి చెల్లించని కారణంగా ఆ గృహనికి నల్లా కనెక్షన్ తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఈ నెలలోపు చెల్లించకపోతే జరిమానాలు విధిస్తామని కమీషనర్ అన్నారు. కార్యక్రమంలో ఆర్వో లక్ష్మన్న, ఆర్ఐ విజయ్, బిల్ కలెక్టర్లు నరేష్, వీరేష్, రాకేష్‌లు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

● ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కార్తీక్

గద్వాల టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ డిమాండ్ చేశారు. వేతనాల కోసం అధికారులపై ఒత్తిడి తెచ్చేందుకు కార్మికులంతా ఏకమై పోరాటానికి సిద్ధపడాలన్నారు. శుక్రవారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ అనుబంధ తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం, పెండింగ్ వేతనాల చెల్లింపు కోరుతూ ఈనెల 17న సోమవారం తలపెట్టిన కలెక్టర్ ముట్టడి ఆందోళనలో పంచాయతీ వర్కర్లు హాజరు కావాలన్నారు. సమావేశంలో పచ్చర్ల తిమ్మప్ప, బజారన్న, రాముడు, తిమ్మన్న, భాస్కర్, సుధాకర్ ఉన్నారు.

మాంటిస్సోరిలో ఘనంగా హోలీ



హోలీ వేడుకలో పాల్గొన్న విద్యార్థులు

అలంపూరు మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాంటిస్సోరి పాఠశాలలో శుక్రవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నాగలక్ష్మి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. హోలీ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా రంగులు చల్లుకున్నారు. పండుగ శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్ కెఎన్.రవిప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు కార్యక్రమం

పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఇక్కడే చదువుకున్న, అలాగే క్రీడారంగం, విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా సన్మానించారు.

పాతకక్షల నేపథ్యంలో పరస్పర దాడులు

- దాదాపు ఏడుగురికి తీవ్ర గాయాలు - హోలీ రోజే గద్వాల జిల్లా కేంద్రంలో ఘటన



రక్తగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సెక్యూరిటీ గార్డు లక్ష్మన్

గద్వాల క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ పండగ సందర్భంగా జిల్లా కేంద్రంలో తెలుగుపేటకు చెందిన ఓ యూత్‌నాయకులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బందిపై బీరు సీసాలతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం చేటుచేసుకున్నది. కొన్నిరోజుల క్రితం ఇదే యూత్‌కు చెందిన కొందరు యువకులు మూడవ వార్డులోని ఓ వ్యక్తిపై బీరు సీసాలతో దాడి చేసిన సంఘటన మరువక ముందే మళ్లీ ఇలా బీరుసీసాలతో దాడి చేయడం జిల్లా కేంద్రంలో చర్చానీయంగా మారింది. ఇందుకు సంబంధించి స్థానికులు, బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న నాగరాజు, సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న లక్ష్మన్‌లతో పాటు మరికొందరు హోలీ సందర్భంగా రంగులు చల్లుకొని మధ్యాహ్నం అందరూ స్నానం చేసేందుకు జిల్లా కేంద్రంలోని కృ ష్ణానదికి వెళ్లారు. అక్కడ స్నానం చేసుందుకు సిద్ధం అవుతుండగా తెలుగు పేటకు చెందిన ఓ యూత్ నాయకుడి అనుచరులు దాదాపు 20 మంది దాకా అక్కడికి చేరుకున్నారు. అయితే ఒడ్డున కూర్చున వీరితో గొడవకు దిగారు. ఆ క్రమంలో మాటామాటా పెరిగి వారితో తెచ్చుకున్న మద్యం బాటిల్‌ను పగులకొట్టి వీరిపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే అక్కడే ఉన్న కొందరు స్థానికులు అడ్డుపడటంతో ఆ యువకులు వీరిపై దుర్భాశలాడుతూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. రక్తగాయలతో ఉన్న లక్ష్మన్, నాగరాజులతో పాటు మరికొంతమందిని స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు నిర్వహిస్తున్నారు. అయితే తెలుగు పేటకు చెందిన యూత్ నాయకుడి అనుచరులకు, వీరికి మధ్య పాత తగాదాలు ఉన్నట్లు జిల్లాకేంద్రంలో చర్చ జరుగుతుంది. తెలుగుపేటకు చెందిన యూత్‌నాయకుడి అను చరులు ఇలా అడ్డువచ్చిన వారిపై బీరుసీసాల తో దాడి చేసి హత్యాయత్నాలు చేసిన పోలీసు లు ఎందుకు కేసులు చేయడంలేదో అర్థం కావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కేవలం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి రాజీ చేస్తూ చేతు లు దులుపుకుంటున్నట్లు తెలుస్తుంది. ఇటీవలే ఇలా జరిగిన సంఘటనపై కేసు చేసిఉంటే ఈ రోజు మళ్లీ ఇలా దాడి జరిగేది కాదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఈ హత్యాయత్నంపై పూర్తిస్థాయిలో విచారించి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విశ్వసిస్తున్నారు. ఈ విషయంపై పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్‌ను వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

గోమాతకు పూజలు



గోమాతకు పూజలు చేస్తున్న సేవాసమితి సభ్యులు, మహిళలు

వడ్డేపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఫాల్గున మాసం హోలీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం శాంతినగర్ శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలోని గోమాతకు గో ప్రచార సేవా సమితి ఆధ్వర్యంలో అర్చకుడు వినయ్ కౌశల్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం మహిళలు ఆలయంలో కుంకుమార్చన నిర్వహించి, లలిత సహస్రనాయ పారాయణం, సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

ఈ సందర్భంగా మహిళా భక్తులు గోమాతకు చీర సమర్పించారు. కార్యక్రమంలో గో ప్రచార సేవా సమితి సభ్యులు రామచంద్రుడు, మాణిక్యం వెంకటేశ్వర్లు, గాయత్రి శ్రీనివాసులు, మద్దిలేటి, కోట వెంకటేష్, కురువ వెంకటేశ్వర్లు, దొంతుకుమారి, పూర్ణిమ, శాంత, సుభాషిని, కోట రజిత, కోట హర్షిత్, యశ్విత ఉన్నారు.

జోగుళాంబ అమ్మవారి సేవలో మాధవీలత



కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకోవడానికి వెళ్తున్న మాధవీలత

అలంపూరు మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అలంపూరు ఐదవ శక్తిపీఠం శ్రీ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను శుక్రవారం హైదరాబాద్‌లోని చార్మినార్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం వారు ఆలయం మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారి ఆలయంలో గణపతిపూజ. అభిషేకం అమ్మవారి ఆలయంలో త్రిశతి అర్చన పూజ వంటి విశేషపూజలు చేసి తీర్థప్రసాదాలు పొందారు. తదనంతరం తుంగభద్ర నది నవబ్రహ్మ ఆలయాలను దర్శించుకున్నారు.